వస్తూ పోతూ వుంటేనే

# చుట్టరికాలు

మధిర భానుమూర్తి

"వస్తూ పోతూంటేనేరా చుట్టరికం. లేకపోతే ఏముంది? రాకపోకలుంటే ఎంతదూరపు చుట్టమైనా దగ్గిరవాడిలాగే ఉంటాడు. రాకపోకలు లేకపోతే ఎంత దగ్గిరవాడైనా దూరమే అయిపోతాడు" అన్నాడు తాతయ్య చుట్టరికాలనుగురించి ఏవో మాటలువస్తే. తాతయ్య అనుభవంమీద చెప్పాడు ఈ మాట. కాదనటానికి వీల్లేదు. చుట్టరికాలు అంతే! రాకపోకలు అంతగా లేని చుట్టాలు ఒకరికొకరు (ఎంతదగ్గిరవాళ్ళైనా) గురుండరు. ఇలా కొంతకాలమయితే తరాలు దాటకముందే బాంధవ్యాలు మరచిపోవటం జరుగుతుంది.

"రమణమ్మగారి ఆడబడుచు మేనకోడలు సవతికూతురు అత్తవారు ఆ ఊళ్ళోనే ఉంటున్నారు. కనక ఆ అమ్మాయి రమణమ్మగారి ఇంటికి తరుచు వస్తూండేది. అందుచేత రమణమ్మగారి పిల్లలూ వాళ్ళ పిల్లలూ అన్నదమ్ముల పిల్లలలాగ తిరుగుతుండేవారు. రమణమ్మగారు ఆ ఊళ్లో ఉండకపోతే ఆ "రెండు కుటుంబాలకీ ఇంత చనువు ఉండేదికాదు. నిజానికి చాలా దూరపు చుట్టరికమేగా?" అని ఉదాహరణ ఒకటి చెప్పి తను చెప్పిన విషయంలో సత్యాన్ని ఋజువు చేసుకున్నారు తాతయ్య.

రమణమ్మగారి చుట్టరికాన్ని గురించి వినేసరికి వరవిక్రయం నాటకంలోని మగపెళ్ళివారి తాలూకు చుట్టాలంతా జ్ఞాపకం వస్తారు. ఆ రోజుల్లో అల్లాంటి దూరపు చుట్టాలంతా వచ్చేవారు కాబోలు. (అసలు చుట్టంకానివారెవరుంటారు? జాగ్రత్తగా చూస్తే ఒకే కులంవారికి ఎక్కడో ఒకచోట చుట్టరికం కలిసే ఉంటుంది- ఇంకా ఇప్పటికి వర్ణాంతర వివాహాలు అంత ప్రచారంలో లేవు కనుక) అలాగని ఆ బంధుత్వాలన్నీ నెమరువేసుకుని ప్రతీ కార్యానికి వెళ్లేందుకు కావలసిన ఓపికాలేదు. వ్యవధీలేదు ఇప్పుడు. అలా ఎవరైనా మొండెత్తువేసి వస్తే వారిని భరించే శక్తికూడా లేదు.

పూర్వీకులకి అంతా తీరికే గనుక చుట్టాలని తరుచు చూచివచ్చేవారు. అదేకాక, అప్పటికి అన్న విక్రయశాలలు లేవు కాబట్టి ఊరి పొలిమేరదాటితే ఎరుగున్నవాడినో, బంధువునో వెతుక్కోవలసి వచ్చేది. ఇంతేకాదు. భుక్తికోసం ఇప్పటంత తాపత్రయపడవలసిన అవసరంలేదు. గనుక ఊరుకాని ఊళ్ళకు మన మాటా మంతీ తెలియని వందలాది మైళ్ళ దూరంలో ఉన్న ప్రదేశాలకు వెళ్ళి అక్కడ చిన్న నౌకరీ సంపాదించుకుని, చాలీచాలని జీతపురాళ్ళతో నిండీ నిండని కడుపులతో ఉండవలసిన అవసరం వాళ్ళకి లేదు. ఇన్ని తాపత్రయాల్లో ఉన్న ఇప్పటివాళ్లు చుట్టరికాలు నిలబెట్టడానికని అత్యంత వ్యయప్రయాసలకోర్చి, ధననష్టానికి సహించి రాగలగడం అంత తేలికైన పనికాదు. "ఆ డబ్బుంటే మరోకందుకెందుకైనా వాడుకోవచ్చును" అనిపించటంలో ఆశ్చర్యమేముంది? అందుచేతనే ఇప్పుడు వరవిక్రయంలో లాంటి చుట్టాలు అంత కనిపించరు ఎక్కడా.

కాని ఈ రోజుల్లోకూడా చుట్టరికాలు నిలబెట్టాలని సంకల్పం చేసుకున్న బంధుప్రియులు లేకపోలేదు. వారు ఎంత దూరాన ఉన్నా ఉత్తరాలద్వారానో మరోలాగో ఆ బాంధవ్యాన్ని నిలబెట్టుకుంటారు. వీరిలో చాలవరకు అవసరం కొద్దీ బాంధవ్యాన్ని స్మరించేవారుంటారు.

నేనొక రోజున సంతలో కూరగాయలు కొంటున్నాను. "ఏరోయ్! మనవాళ్ళంతా కులాసానా? మీనాన్న ఎక్కడిప్పుడు? మీ అమ్మమ్మ —ముసలావిడ—ఆవిడ బాగుందా? మీరెండో

చెల్లెలికి సంబంధం కుదిరిందా? ఆ మధ్య మీ నాన్న తెగతిరిగాడు సంబంధాలకోసం. మనం అనుకుంటాంగాని మనచేతుల్లో ఏముంది? అంతా వాడి యిష్టం. మాయామానుష విగ్రహుడు. వాడు ఏమనుకుంటే అదే అవుతుంది... సరే! నువ్విప్పు డెక్కడుంటున్నావు? ఏంచేస్తున్నావు?" అన్నాడు. ఆయన ఎవరో నేనెరుగను. ఎన్నడూ ఆయనను చూసిన గుర్తులేదు కనీసం ఆయన రూపురేఖావిలాసాలను గురించి విననైనాలేదు ఎన్నడూ. "ఈయన ఎవరా?" అని ఆశ్చర్యపోయాను. నన్ను గురించి బాగా తెలిసి ఉన్న వారే అయి యుండాలి. కాకపోతే ఏకవచనంలో సంబోధిస్తారా? అందులోనూ "ఒరేయ్!"అని. ఇన్ని ఆలోచనలు నా బుర్రలో తిరుగుతుండగా నా అవస్థ గ్రహించాడు ఆయన. "నీకు తెలియదేమోగాని మీ నాన్న నేను చదువుకున్నాంరా, అబ్బాయ్! ఆరోజుల్లో ఎంత కలిసి మెలిసి ఉండే వాళ్ళం! ఇద్దరం ఒకటే అనుకో. మీరింకా అప్పటికి పుట్టలేదు" అన్నారు. "పాతకాలపు స్నేహాలు అలాంటివి. ఎప్పుడో చిన్ననాటి స్నేహితుడిని మరచిపోలేదు గదా! నాకు నిన్నకాక మొన్నటి వరకూ కూడాఉన్నవాళ్ళే జ్ఞాపకముండటంలేదు" అని నేను ఆలోచిస్తుండగా "అదిసరేగాని, ఒక్క పావలా ఇలా ఇయ్యి ఒరే! తీరా సంతలోకి వచ్చాక చూచుకున్నాను. తెచ్చినడబ్బు చాలలేదు." అన్నారు. ఇలాంటి మనిషి ఒకాయన ఉన్నాడని నేను వెనక విని ఉండడంచేత అర్థంచేసుకున్నాను ఆయన విషయం. ఆయనకు మా నాన్నగారేకాదు అందరి తండ్రులూ స్నేహితులే. అందరూ బంధువులే. ఆ పావలా చేతులో పడేవరకూ.

మరొకనాడు బండెడు పిల్లలతో ఒకావిడ మా యింటిముందు బండి ఆపించింది. బండిలోంచి దిగి, పిల్లలనుదింపి, "ఇదిగోబండి అబ్బాయ్! సామాన్లులోపల పెట్టమ్మా. ఇదే మావాళ్ళయిల్లు" అంది. బండివాడు సామానులోపలకు తెచ్చాడు. ఆవిడ ఎవరో మా అమ్మతాలూకు చుట్టమని నాన్నగారు, నాన్నగారి తాలూకు చుట్టమని మా అమ్మ అనుకున్నారు. ఎవరికీ నోటివెంట మాటరాలేదు. సరాసరి లోపలికివస్తూ "ఏమే! అమ్మాయీ! ఎన్నాళ్ళయిందే మిమ్మల్ని చూసి? అంతా కులాసాగా ఉన్నట్టేనా!...ఇదాళ మీ యిల్లు బాగుందమ్మా! బాగుంది. శుభ్రమైన లోగిలివేశాడు మీ ఆయన. మీనాన్న అనేవాడు "మా అమ్మాయి అదృష్టవంతురాలు" అని. అయితేనేం! ఆయనకు చూసుకుందుకు లేకపోయింది.. ఇదుగో! ఇది మా అమ్మాయి వీళ్ళు దానికి పిల్లలు. ఆఁ! అది...నువ్వేనన్నా చెప్పూ, పిల్లలతో వెళ్ళకు బయలుదేర కూడదనుకో ఈ రోజుల్లో. అన్నికష్టాలే. వీళ్ళకి వేళకి కావలసిన వేమైనా దొరుకుతాయి గనుకనా?..ఇదుగో చూశావుగా! వీళ్ళందరినీ వేసుకు బయలుదేరివస్తే రైలుదాటి పోయింది ఏదో ఈ వంకనైనా మిమ్మల్ని ఒకసారి చూడటంపడింది. మా అమ్మాయి మిమ్మల్ని ఎరగనంది. ఏదీ అది పెద్దదయాక మేమూ రాలేదు. మీరూరాలేదు..అయినా, ఇప్పటివాళ్ళకి తగని సిగ్గూ మొహమాటమున్నూ మీరు ఈ ఊళ్లో ఉండగా ఇంకోచోటికి ఎలా వెళ్ళం?చెప్పమ్మా!" అంటూ ఆవిడి సాభినయంగా మహోపన్యాసం చేసింది. అంతా తెల్లపోయి చూస్తున్నాం. "ఏమే? అల్లానుంచుంటావు? పిల్లలకి కాస్త మొహాలు కడిగి, మంచినీళ్ళిచ్చి, ఏంకావాలో చూడవే!" అని గదమాయించింది కూతురుని. ఇంత జబర్దస్తీగా లోపలికి వస్తూన్న ఆవిడను గురించి మా యింట్లో ఎవరికీ కూడా తెలిసినట్టు తోచదు. ఆవిడమట్టుకు చాలా కలిసికట్టుగా మా యింట్లో మనిషిలా మాట్లాడుతోంది. కొంత సేపటికి మాటలసందర్భంలో తెలియపరచింది ఆవిడ మా కెలాంటి చుట్టమో. అటునుంచి పది తరాలు ఇటునుంచిపదితరాలు లెక్కపెడితే చివరికి ఒకచోట కలిసింది బాంధవ్యం. మిగిలిన విషయాలెలా ఉన్నా అంతటి చుట్టరికాన్ని గుర్తించుకొని ఆవిడ మా యింటికి సపరివార సమేతంగా విచ్చేయటం నిజంగా చాలా గొప్పవిషయమే

ఇలాంటివారు చాలామందిఉంటారు. ఎవరో ఏమిటి? మనకేమీ తెలియని ఊరు ఏదైనా పని మీద వెడితే అక్కడ మన ఊరివాడెవడైనా ఉన్నాడేమో వాకబుచేసి, తెలుసుకుని, వాడ్ని కలుసుకుని, చుట్టరికం కలిపి, అతడి పంచని కాలక్షేపం చేస్తాం. మన ఊళ్ళో ఉన్నప్పుడు అత

నిలో మాటైనా మాట్లాడని మనం పొరుగూరిలో ఉన్నప్పుడు అతనితో స్నేహమో, చుట్టరికమో కలిపామంటే, అవసరమైనప్పుడు ముక్కూమొహం తెలియనివాడితో కూడా చుట్టరికం కలపడానికి ఎవరూ వెనుకాడరని తెలుస్తోంది.

నిజంగా అవసరం వచ్చేవరకూ ఆగకుండా "ఎప్పటికి ఏ అవసరం వస్తుందో?"అని స్థితిమంతులతోను, ఉన్నత పదవులలోనున్న వారితోను ముందే చుట్టరికాలు కలిపి జాగ్రత్తపడేవారుంటారు. ఒక వ్యక్తి ఏ శాసనసభ్యుడుగానో ఎన్నిక అయితే మరుక్షణాన్నుంచి ఆయనకు దేశమంతా బంధువులే బయలుదేరుతారు. "ఓ! ఆయనా! ఆయన మా పెద్ద మేనమామ బావమరిది అత్తగారి ఆడబడుచు కొడుకేగా!"అంటాడు కొంచెం అమాయకుడైతే. ఆదే గడసరి అయితే "మాకు బాబయ్యేగా! వరసకి" అంటాడు. ఇంతటితో ఆగరు. ఏమాత్రం ఆయనకు పరిచితులు కాని వారెందరో ఆయన పేరు చెప్పుకుని బ్రతుకుతెరువులేర్పరుచుకుంటూరు.

గొప్పవాళ్ళకి బంధువులు ఎంత త్వరగా ఏర్పడుతారో, అభాగ్యులకి బంధువులు అంతా దూరమయిపోతారు. ఒక దొంగ కాని ఒక చెడ్డపని చేసినవాడుగాని ఉంటే వాడిని ఆప్తులుకూడా విస్మరిస్తారు. "ఫలానావాడు మీకు దగ్గరే అనుకుంటాను"అని ఎవరేనా ప్రశ్నిస్తే, ఎంత దగ్గిరవాడైనా సరే, "ఏం దగ్గిర! ఏదో దూరపుచుట్టం. ఆమాత్రం చుట్టరికం నీకూ ఉండకపోదు"అని అంటాడు. ఇలాంటి మనస్తత్వం ఉండడం మామూలు. స్థితిమంతులూ, ఉన్నత పదవుల్లో ఉన్నవారూ అందరికీ చుట్టాలే. బీదవాళ్లూ, సంఘం సహించని పనులు చేసినవారూ, ఎవరికీ చుట్టాలు కారు!

---

స్కెచ్

# వెంకటేశం

విశ్వమిత్ర

వెంకటేశం క్లాసులోకి అడుగుపెట్టగానే పిల్లలందరూ లేచి నుంచున్నారు. బోర్డువైపు తల తిప్పకుండానే వెంకటేశం కుర్చీలో కూర్చున్నాడు. పిల్లల్లో గుసగుసలు బైల్దేరినయ్. డస్టర్‌ని బల్లమీద కొడుతూ సైలెన్స్ అన్నాడు వెంకటేశం. వెంటనే గుసగుసలు ఆగినాయి. కానీ మళ్ళీ రెండు నిముషాలైనా కాకముందే గోల బైల్దేరింది. వాళ్ళ గోలకి కారణాన్ని తెలుసుకోవాలని లేనట్టు వెంకటేశం పాఠం మొదలెట్టాడు. మధ్యలో బోర్డుమీద ఏదో రాయాల్సి రావటం వల్ల వెంకటేశం, కుర్చీలోంచిలేచి చేతిలోకి డస్టర్‌ని తీసుకుని, మళ్ళీ ఎందుకనో దాన్ని బల్లమీదనేవుంచి ప్లాట్‌ఫారం దిగాడు. పిల్లలంతా ఒక్కసారి గొల్లుమన్నారు. వెంకటేశం బోర్డువంక చూశాడు. పిల్లలందరివంకా ఓసారి చూశాడు. పిల్లలంతా సైలెన్సు అనకుండానే సైలెంట్‌గా వున్నారు. వెంకటేశం ఆశ్చర్యంగా మొహంపెట్టి, మూతి వంకరగా తిప్పుతూ బోర్డుమీద చాక్‌పీసుతో రాసివున్న "సిరా మరకల వెంకటేశం" అన్న మాటని గట్టిగా చదివాడు. వస్తూన్న నవ్వుని ఆపుకుంటూ వెంకటేశం, కోపాన్ని ముఖంలో చూపెడుతూ "ఎవర్రా ఇది రాసింది?" అన్నాడు. పిల్లలందరూ ఒకళ్ళ మొహాలు ఒకళ్ళు చూసుకొంటున్నారు. వెంకటేశం తన జేబుకివున్న సిరా మరకల్ని ఓసారి కావాలని చూసుకుని, బోర్డుమీద వున్న "సిరా మరకల వెంకటేశం"ని చూస్తుండగా పిల్లలంతా ఒక్కసారి గొల్లుమన్నారు. "చెప్పరేం-ఎవరు రాసింది?" అన్నాడు ఎస్. వెంకటేశం-ఎవడో తెలిస్తే డొక్క చీరేస్తాను అనే గొంతుతో.

ఎంతసేపటికీ ఎవ్వరూ లేచి నుంచోకపోయేటప్పటికీ వెంకటేశం, క్లాసు మొత్తాన్ని, ఆ పీరియడ్ అంతా తిట్టటంతోనే గడిపేశాడు. ఐతే మొహంలో సీరియస్‌నెస్ లేదు. ఆ పీరియడ్